సాక్షి అనంతపురం

గురువారం । 21 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.38,300

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,300 పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.16, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/15.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గంజాయి రవాణాను అరికట్టాలి

- ఎస్పీ జగదీష్



అనంతపురం: గంజాయి సరఫరా, రవాణా, క్రయ, విక్రయాలను అరికట్టాలని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా సర్కిళ్ల వారీగా ఎస్పీ కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్మూలించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలు, ఓవర్‌లోడ్, ట్రిపుల్‌రైడ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారు, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానా విధించాలన్నారు. ప్రజలతో మమేకమై స్నేహపూర్వకంగా, సహాయకారిగా మెలిగినప్పుడే పోలీసుల పట్ల సదభిప్రాయం ఏర్పడి విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, డీఎస్పీలు వి. శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, రామకృష్ణుడు, మహబూబ్ బాషా, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మునిసిపల్ హెచ్‌ఎం పదోన్నతులు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ, మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో మూడు గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులకు, ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీ స్కూళ్లలోని మూడు గ్రేడ్–హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు జరిగాయి. డీఈఓ కార్యాలయంలో ఉదయం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి మధ్యాహ్నం కౌన్సెలింగ్ ద్వారా ఆయా పోస్టులను భర్తీ చేశారు. 1:3 చొప్పున కౌన్సెలింగ్‌కు పిలవగా.. అనంతపురం కార్పొరేషన్‌లో మొదటి అభ్యర్థి నాట్ విల్లింగ్ ఇచ్చారు. తక్కిన ముగ్గురూ పదోన్నతులు తీసుకున్నారు. మునిసిపాలిటీలకు వచ్చేసరికి మూడు పోస్టులకు 9 మంది అభ్యర్థులను పిలవగా ఇద్దరు విల్లింగ్ ఇచ్చి.. తక్కిన ఏడుమంది నాట్ విల్లింగ్ ఇచ్చారు. దీంతో సీనియార్టీ జాబితాలో 13వ స్థానంలో ఉన్న టీచరు ఫోన్ ద్వారా విల్లింగ్ ఇవ్వడంతో ఆయనను గురువారం కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు.

మలేరియా సబ్ యూనిట్ అధికారి సరెండర్

అనంతపురం మెడికల్: ఆరోగ్యశాఖలో ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న కోదండరామిరెడ్డిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం కడప ఆర్‌డీకి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నకిలీ యూనియన్ పేరుతో కొంత మందిని బెదిరిస్తున్నట్లు అతనిపై ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు



శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు

అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ డీఆర్‌సీ భవన్‌లో నీటి సంఘాల ఎన్నికలపై అధికారులకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ కేశవనాయుడు, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, చిన్ననీటి పారుదలశాఖ ఎస్ఈ విశ్వనాథ రెడ్డి, ట్రైనర్స్ రాజ్‌కుమార్, ఈఈ రమణారెడ్డిలు హాజరై ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. ఓటర్లుగా ఉన్న ఆయకట్టు రైతుల వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ రోజే చైర్మన్ ఎన్నిక ఉంటుందన్నారు. ఉదయం నామినేషన్ ప్రక్రియ, ఉప సంహరణ, ఫలితాల వెల్లడి జరుగుతుందని వివరించారు. త్వరలోనే మార్గదర్శకాలు విడుదలవుతాయని పేర్కొన్నారు.

మనుషుల్నే మింగేస్తున్న పురుగు మందు



- మొదటికే మోసం తెస్తున్న క్రిమి సంహారకాలు
- మనుషులపై తీవ్ర దుష్ప్రభావం
- తెల్ల, ఎర్ర రక్త కణాల ఆవిరి
- క్యాన్సర్, అల్సర్‌లకు దారితీస్తున్న వైనం
- ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోతున్నట్లు వైద్యుల హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పైర్లపై క్రిమి కీటకాలు దాడి చేస్తుంటే.. వాటిని చంపేందుకు వాడుతున్న పురుగు మందులు మనుషులపై దాడి చేస్తున్నాయి. ఏవైనా వ్యాధులు సోకినప్పుడు మనకు రక్షణ కవచంలా పనిచేసేది మూలకణాలే. ఎలాంటి రోగాలనైనా తిప్పికొట్టే సామర్థ్యం వీటికి ఉంటుంది. అలాంటి మూల కణాలపైనే పురుగు మందుల అవశేషాలు దాడి చేస్తున్నట్లు తేలింది. ఈ విషయం ప్రజలనే కాదు వైద్యులను కూడా తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే రకరకాల వైరస్‌లు, బాక్టీరియాలు దొంగ దెబ్బ తీస్తుండగా... నేడు పురుగు మందుల అవశేషాలు కూడా కోలుకోలేని దెబ్బతీస్తున్నట్లు వెల్లడి కావడం గమనార్హం. ఇకపోతే మందుల అవశేషాల వల్ల శరీరానికి ప్రాణవాయువులా ఉండే తెల్లరక్తకణాలు, ఎర్రరక్తకణాలు, ప్లేట్‌లెట్స్ కూడా ప్రమాదానికి గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ మొదలు ఎప్లాస్టిక్ ఎనీమియా (బోన్‌మారో ఫెయిల్యూర్ సిండ్రోమ్) వంటి తీవ్రమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నట్లు వివరిస్తున్నారు.

తీవ్ర నీరసం..

ఎప్లాస్టిక్ ఎనీమియా వల్ల శరీరంలో ప్రధానంగా హిమోగ్లోబిన్ శాతం పడిపోతుంది. తెల్లరక్త కణాలు గణనీయంగా తగ్గుతాయి. ఇక ప్లేట్‌లెట్స్ కౌంట్ వందల్లోకి చేరుతుంది. దీంతో మనిషి రోజు రోజుకు నీరస పడిపోతాడు. ఆరోగ్యవంతుడికి హిమోగ్లోబిన్ 14 ఉండాలి. కానీ ఎప్లాస్టిక్ ఎనీమియా బాధితుడికి 2 వరకు పడిపోతుంది. ప్లేట్‌లెట్స్ సాధారణంగా 1.50 లక్షల నుంచి 4 లక్షల పైన ఉండాలి. అలాంటిది వెయ్యికి కూడా పడిపోతాయి. దీనంతటికీ కారణం మూల కణాల్లోనుంచి ఉత్పత్తి కావాల్సిన తెల్లరక్త కణాలు, ఎర్రరక్త కణాలు, ప్లేట్‌లెట్స్ ఉత్పత్తి కాకపోవడమే. అంతేకాదు కొన్ని రకాల క్యాన్సర్‌లు, అల్సర్‌లు, చర్మానికి సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులకు పురుగు మందుల అవశేషాలు కారణమని వైద్యులు చెబుతున్నారు.

విచ్చలవిడిగా వాడకం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూరగాయలతో పాటు పండ్ల తోటల వ్యవసాయం ఎక్కువగా ఉంది. పురుగు మందు పిచికారీ చేస్తేగానీ పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వాడుతుండటంతో ఆ అవశేషాలు మనిషి శరీరంలోకి వెళ్లి తీవ్ర దుష్ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పురుగు మందుల అవశేషాల కారణంగా వస్తున్న జబ్బులను వైద్యులు వెల్లడిస్తున్నారు. దీర్ఘకాలిక జబ్బుల కారణంగా ఎక్కువమంది ప్రభావితమవుతున్నట్లు తేలింది. ముఖ్యంగా ఎప్లాస్టిక్ ఎనీమియా బారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం

ఖరీఫ్	6.50 లక్షల హెక్టార్లు
రబీ	1.75 లక్షల హెక్టార్లు
ఉద్యాన పంటలు	5 లక్షల ఎకరాలు
ఏడాదికి పురుగు మందుల పిచికారీ	సుమారు 800 టన్నులు

అవగాహన లేకుండా వాడుతున్నారు



ఇటీవల కాలంలో చీడపీడలు, తెగుళ్ల నివారణకు కాంబినేషన్ విధానంలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక మందు అవసరమైనా... అందులో మరొకటి లేదా రెండు రకాల మందులు కలిపి వాడుతున్నారు. సరైన అవగాహన లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పురుగు, తెగుళ్ల ఉధృతిని అంచనా (ఎకనామిక్ థ్రెషోల్డ్ లెవెల్) వేయకుండా లక్షణాలు కనిపించిన తక్షణమే పురుగు మందులు వాడుతున్నారు. కనీసం మూడేళ్లకు ఒకసారి లోతుగా దుక్కులు చేసుకుంటే కోశస్థ దశలో ఉన్న పురుగులు నశిస్తాయి. అలాగే ఒకే పంట కాకుండా మార్పిడి చేసుకోవాలి. పంట కాలంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించినపుడు మందుల ఖర్చులు బాగా తగ్గిపోతాయి. వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తలు, పురుగు మందుల డీలర్లు సంయుక్తంగా రైతుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ విజయశంకరబాబు, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, రేకులకుంట.

జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుత రోజుల్లో రసాయనాలతో పండించిన పంటల వాడకం అధికమైంది. వీటివల్ల కిడ్నీ, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. కేన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. పంటలకు క్రిమిసంహారక మందులు అధికంగా వాడడం వల్ల దీర్ఘకాలిక జబ్బుల బారిన పడే అవకాశాలూ ఉన్నాయి. వీలైనంత వరకు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఒకటికి రెండుసార్లు శుభ్రం చేసుకోవడం తదితర జాగ్రత్తలు పాటించాలి. ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలి.

– భీమాసేనాచార్, హెచ్‌ఓడీ, జనరల్ మెడిసిన్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు



అనంతపురం: అదనపుకట్నం కోసం వేధించి భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వివరాలు.. గుంతకల్లులోని అరవింద నగర్‌కు చెందిన బాలాజీనాయక్ కుమారుడు కే. సుబ్రమణ్యం నాయక్‌కు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం రాచువారిపల్లికి చెందిన అఖిలతో 2021లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో యువతి తల్లిదండ్రులు 10 తులాల బంగారు నగలు ఇచ్చారు. అయితే, ఆ తర్వాత కొన్నాళ్లకే అదనపు కట్నం కోసం భార్యను సుబ్రమణ్యం నాయక్ వేధించడం ప్రారంభించాడు. రూ.10 లక్షలు, ఒకటిన్నర ఎకర పొలం తన పేరు మీద రాయించాలని సతాయించేవాడు. మరోవైపు అఖిలపై అనుమానం పెంచుకుని హింసించేవాడు. ఈ క్రమంలోనే 2022 మార్చి 31 రాత్రి 8:30 గంటల సమయంలో అఖిల తన తల్లికి ఫోన్ చేసింది. 'నన్ను ఎక్కడెక్కడో తిప్పి ఇంటికి తీసుకొచ్చాడు. ఏం చేస్తాడో అనే భయం వేస్తోంది. రేపు ఉదయాన్నే ఊరికి వస్తా' అని చెప్పింది. అయితే, ఆ తర్వాతి రోజే సుబ్రమణ్యం నాయక్ అఖిలను గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గుంతకల్లు సీఐ నాగశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతపురం నాలుగో సెషన్స్ జడ్జి కోర్టు(మహిళా న్యాయస్థానం)లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో పీపీ సుజన 13 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో బుధవారం నాలుగో సెషన్స్ జడ్జి శోభారాణి తీర్పు వెలువరించారు. ముద్దాయి కే. సుబ్రమణ్యం నాయక్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేశ్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సా రెడ్డి, కానిస్టేబుల్ నాగేంద్రయ్యను ఉన్నతాధికారులు అభినందించారు.

రైతులతో బీమా ప్రీమియం కట్టించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: రైతులతో బీమా ప్రీమియం డిసెంబర్ 15 లోపు కట్టించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రస్తుత రబీకి సంబంధించి అమలులో ఉన్న ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంటల బీమా పథకాలు రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రబీలో పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వరి పంటలకు ఫసల్ బీమా, అలాగే వాతావరణ బీమా కింద టమాటకు వర్తింపజేశారని తెలిపారు. వ్యవసాయ పంటలకు 1.5 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం డిసెంబర్ 15 లోపు రైతులు చెల్లించాల్సి వుందన్నారు. పప్పుశనగ ఎకరాకు రూ.450 ప్రకారం, వేరుశనగ ఎకరాకు రూ.480, జొన్నకు రూ.315, మొక్కజొన్న రూ.325, వరికి రూ.630, టమాట రూ.1,600 ప్రకారం రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. రుణాలు పొందుతున్న రైతులు బ్యాంకుల్లోనూ, రుణాలు లేని రైతులు కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ), సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేదా నేషనల్ క్రాప్‌ఇన్సూరెన్స్ పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో తమ వాటా చెల్లించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకు వ్యవసాయ, ఉద్యానశాఖతో పాటు ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట కోత ప్రయోగాల ఫలితాలు, ఆటోమేటిక్ వెదర్ రిపోర్టు ఆధారంగా బీమా పరిహారం లెక్కించి రైతులకు పరిహారం ఇస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో మలోలా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, సీపీవో అశోక్‌కుమార్, డీహెచ్‌వో నరసింహారావు, ఎల్‌డీఎం నర్సింగ్‌రావు, ఇన్సూరెన్స్ కంపెనీ, ఎన్ఐసీ అధికారులు, టెక్నికల్ ఏవోలు పాల్గొన్నారు.

'పీఎం ఆవాస్'పై విస్తృత అవగాహన

గుత్తి రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామంలో బుధవారం జరిగిన 'పీఎం ఆవాస్ యోజన, సప్తాహ్' వారోత్సవాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గృహానికి రూ.1.20 లక్షలు అందుతుందని వివరించారు. స్థలం ఉన్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తామని, స్థలం లేని వారు అర్జీ ఇస్తే మంజూరు చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రోడ్లు, ఇంకుడు గుంతలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శైలజను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించుకున్న ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించిన సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన మిషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం అవుతోందని ఎంపీపీ విశాలాక్షి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, తహసీల్దార్ ఓబిలేసు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కల్యాణి, సీహెచ్‌ఓలు నాగమణి, మోనాలిసా, ఏఎన్‌ఎం సుగుణ, హౌసింగ్ డీఈ మధుసూదన్‌రెడ్డి, ఏఈ సూర్యనారాయణ, సర్పంచ్ సుహాసిని, ఎంపీటీసీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు అన్యాయంపై ఆగ్రహం



అనంతపురం జిల్లా కోర్టులో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

- కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్
- జిల్లా కోర్టులో విధుల బహిష్కరణ

అనంతపురం: కూటమి ప్రభుత్వ అన్యాయపూరిత చర్యలపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లోకాయుక్త, హెచ్‌ఆర్సీ, నల్సార్ వర్సిటీని అమరావతికి తరలించాలన్న సర్కారు నిర్ణయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కోర్టులో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎంసీ సంపత్‌కుమార్, బీజే రవికుమార్, జి. ఉమాపతి, నాగన్న, వెంకట్రాముడు, శ్రీనివాస్ రెడ్డి, హనుమన్న, రంగనాయకులు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసేంత వరకు నిరవధికంగా నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేసి రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. దశాబ్దాలుగా రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా జగన్నాథ గట్టుపై నిర్మిస్తున్న నల్సార్ వర్సిటీని సైతం అమరావతికి తరలించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేస్తామంటూ 2014–19 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న బీజేపీ.. నేడు మౌనంగా ఉండడం సరికాదని విమర్శించారు. కాగా... ఎయిమ్స్‌ను సైతం అనంతపురంలో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ తీర్మానించింది. గురువారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

పింఛన్‌దారులపై 'పచ్చ' కుట్ర



ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులు

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా నోటీసులు

రాప్తాడు: 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ తిరుగుతున్న టీడీపీ నాయకులు పింఛన్ దారులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. పింఛన్ అందకుండా చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. అనర్హులంటూ ఈ నెల 6వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా దాదాపు 140 మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు అధికారుల ద్వారా నోటీసులు పంపారు. వీరిలో ఒక్కరు కూడా టీడీపీ వారు లేకపోవడం గమనార్హం.

అధికారులపై ఒత్తిడి.. : రాప్తాడు మండల వ్యాప్తంగా దాదాపు 7 వేల మంది వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించాలని అధికారులపై పచ్చ పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు. తాము చెప్పినట్లు చేయకుంటే బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లాలని బెదిరిస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లు భరించలేక ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

బాధితుల ఆవేదన.. : నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు బుధవారం రాప్తాడులోని ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని తమ అర్హత పత్రాలను అధికారులకు చూపించారు. నోటీసులు అందించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లను నిలుపుదల చేస్తే హైకోర్టులో దావా వేస్తామని స్పష్టం చేశారు. పింఛన్‌దారులకు వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ మద్దతు పలికారు. కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతి పరులకే నోటీసులు పంపడం అన్యాయమని, వైఎస్సార్ సీపీ 5 ఏళ్ల పాలనలో ఒక్క పింఛను కూడా తొలగించలేదని పేర్కొన్నారు. అర్హుల పింఛన్లు తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయంపై ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి మాట్లాడుతూ విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రేమిస్తావా.. చంపమంటావా?

- విద్యార్థినికి యువకుడి వేధింపులు
- ఆమె ఉంటున్న హాస్టల్‌కే వెళ్లి దాడి

అనంతపురం: ప్రేమించకపోతే చంపేస్తానంటూ ఓ యువకుడు విద్యార్థినిపై దాడి చేసిన ఘటన అనంతపురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన విద్యార్థిని అనంతపురంలోని సాయి నగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కేఎస్‌ఆర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తనను ప్రేమించాలంటూ అదే గ్రామానికి చెందిన రవి కొన్నాళ్లుగా బాలిక వెంట పడుతున్నాడు. బుధవారం సాయంత్రం విద్యార్థిని ఉంటున్న హాస్టల్ వద్దకు వెళ్లాడు. తనను ప్రేమించకపోతే చంపేస్తానంటూ ఆమెను బెదిరించాడు. అందరూ చూస్తుండగానే విద్యార్థినిపై దాడి చేశాడు. ఈ క్రమంలోనే గట్టిగా తోయడంతో కింద పడిన బాలిక కాలికి గాయమైంది. విషయాన్ని బాధితురాలు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పగా.. వారు అనంతపురం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

కొత్త వీసీ వచ్చే వరకే రెక్టార్, రిజిస్ట్రార్

- నూతన వైస్ చాన్స్‌లర్ వచ్చాక అభీష్టం మేరకు నిర్ణయం
- ఎస్కేయూ పాలకమండలి సమావేశంలో తీర్మానం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు నూతన వీసీ వచ్చే వరకు మాత్రమే పదవుల్లో కొనసాగుతారు. కొత్త వీసీ తన అభీష్టం మేరకు వారిని పదవుల్లో కొనసాగించవచ్చు లేదా తొలగించవచ్చు. ఈ మేరకు ఎస్కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పాలకమండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. స్టాటిస్టికల్ ఆఫీసర్ అయిన రమేష్ బాబు రిజిస్ట్రార్ పదవికి అనర్హుడని ఇటీవల పలువురు ప్రొఫెసర్లు మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్, డిప్యూటీ రిజిస్ట్రార్ హోదా గల వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియామకం చేయవచ్చనే నిబంధన ఉన్నప్పటికీ, ఎలాంటి అర్హత లేని వ్యక్తికి బాధ్యతలు అప్పగించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే జరిగిన పాలకమండలి సమావేశంలో రిజిస్ట్రార్ పదవిని ర్యాటిఫై చేసే అంశాన్ని ప్రవేశపెట్టగా కోన శశిధర్ సమ్మతించలేదు. పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రస్తుత రిజిస్ట్రార్, రెక్టార్ పదవులకు ఆమోదం తెలపలేమని స్పష్టం చేశారు. కొత్త వీసీ వచ్చే వరకు మాత్రమే కొనసాగాలని సూచించారు.

- 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లలో జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. శ్రీకాంత్ గతంలో వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. వెంటనే అప్పటి వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆమోదం తెలపడంపై ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారు. ఒక ఉద్యోగి రాజీనామా చేస్తే కనీసం పిలిచి మాట్లాడి పునరాలోచించుకోవాలని కోరకుండా ఏకపక్షంగా రాజీనామాను ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆమోదంతో ఆయన్ను తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని పాలకమండలి నిర్ణయించింది. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సందర్భంగా పాలకమండలి సభ్యులుగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను కాసేపు సమావేశం నుంచి బయటకు వెళ్లాలని కోరారు. కాగా, తమ పదవులను ర్యాటిఫై చేసే సమయంలో రెక్టార్, రిజిస్ట్రార్ సమావేశంలో ఉండకూడదు. కానీ ఇద్దరూ మీటింగ్‌లో కూర్చుని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు.

క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ



పీహెచ్‌సీ నూతన భవనం వద్ద జేసీ శివనారాయణశర్మ, తదితరులు

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీని బుధవారం కళ్యాణదుర్గం ఆర్‌డీఓ వసంతబాబుతో కలసి జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో ఆర్ఐ విధుల్లో లేకపోవడం గమనించి తహసీల్దార్ షర్మిళను ప్రశ్నించారు. విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో ఓపీ వివరాలపై వైద్యాధికారి ప్రియాంకతో ఆరాతీసారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం రమనేపల్లి వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనుమతుల జారీ అంశానికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ నివాసి ప్రహ్లాద (38) ఆత్మహత్య చేసుకున్నాడు. 15 ఏళ్ల క్రితమైన ప్రహ్లాదకు భార్య తిప్పమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ నాలుగేళ్ల క్రితం తిప్పమ్మ మృతి చెందింది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం పద్మక్కను పెళ్లి చేసుకున్నాడు. కుటుంబంలో తరచూ గొడవలు చోటు చేసుకుంటుండడంతో తాగుడుకు బానిసైన ప్రహ్లాద గ్రామ శివారులోని గుడిసెలో బుధవారం మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. జిల్లాలో గంజాయి విక్రయాలపై ఈ నెల 18న 'గం'జాయ్' శీర్షికన 'సాక్షి' వెలువడిన కథనంపై ఎస్పీ జగదీష్ స్పందించారు. గంజాయి విక్రయాలు అరికట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో విస్తృత తనిఖీలు చేపట్టిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు చెరువు కట్టపై అనుమానాస్పదంగా తచ్చాడుతున్న దూదేకుల షంషాద్‌వలి అలియాస్ షెక్షావలి అలియాస్ షెక్షా, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాన్ అలియాస్ జిలాన్‌తో పాటు మైనర్ బాలుడుని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో వారి వద్ద రెండు కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుత్తి: రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ మార్గంలోని ఆర్ఓబీ సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటనా స్థలాన్ని జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప మాట్లాడుతూ... మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఇతర ఆధారాలేమీ లభ్యం కాలేదని, ఆచూకీ పసిగట్టిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొదుపు మంత్రం తప్పనిసరి..

- నీటి ఒత్తిడి జాబితాలో 16 మండలాలు
- నీటి పొదుపు తప్పనిసరి అంటున్న నిపుణులు



అనంతపురం అగ్రికల్చర్: ఇప్పటికే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మండలాలతో పాటు మిగిలిన మండలాల్లోనూ నీటి వాడకం బాగా తగ్గించి పొదుపు చర్యలు చేపట్టకపోతే వేసవిలో మరింత ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుందని భూగర్భ జలవనరుల శాఖ అధికారులు అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో భూగర్భ జలాలు పదిలంగా ఉన్నా... 16 మండలాలు తీవ్ర నీటి ఒత్తిడికి గురవుతున్నట్లు నివేదికలూ పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో నీటి పొదుపు చర్యలు చేపడితే వచ్చే వేసవి నుంచి గట్టెక్కవచ్చని, లేకపోతే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు.

క్లిష్ట పరిస్థితుల్లోనే ఆ మండలాలు..

జిల్లా వ్యాప్తంగా 97 ప్రాంతాల్లో ఉన్న ఫిజోమీటర్ల ఆధారంగా ఆ శాఖ సేకరించిన వివరాలు పరిగణనలోకి తీసుకుంటే ఈ సారి సగటు నీటిమట్టం 9.21 మీటర్లుగా నమోదు కావడం గమనార్హం. భూగర్భ జలాలు మెరుగుపడుతున్నట్లు భూగర్భ జలవనరుల శాఖ అంచనా వేసినా... ఇప్పటికీ 16 మండలాలు నీటి ఒత్తిడికి గురవుతున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అనంతపురం, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, డి.హిరేహాల్, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కంబదూరు, కూడేరు, కుందుర్పి, నార్పల, పామిడి, పుట్లూరు, శెట్టూరు, తాడిపత్రి, యాడికి తదితర మండలాల్లో నీటి ఒత్తిడి ఉన్నట్లు అంచనా వేశారు.

ఈ చర్యలు తప్పనిసరి

ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటలు, చెక్ డ్యాంల మరమ్మతులు చేపట్టి భూగర్భంలో నీరు ఇంకే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరు తడి పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించడం విశేషం. యాడికి మండలం రాయలచెరువు ఫిజోమీటర్‌లో 34.90 మీటర్లలో భూగర్భజలాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. అలాగే శెట్టూరు ఫిజోమీటర్‌లో 31.18 మీటర్లు, యాడికి మండలం నగరూరులో 28.80 మీటర్లు... ఇలా కొన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గిపోయినట్లు గుర్తించారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన ప్రాంతాలు, చెరువులు నిండిన మండలాల్లో నీటిమట్టం మెరుగుగా ఉన్నట్లు చెబుతున్నారు. 97 ఫిజోమీటర్లకు గానూ 43 ఫిజోమీటర్లలో 8 మీటర్లు అంతకన్నా ఎక్కువ లోతులో భూగర్భజలాలు ఉన్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే పరిస్థితి లేనందున నీటి పొదుపు చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని హెచ్చరిస్తున్నారు.

తండ్రీ కొడుకును కబళించిన విద్యుత్ తీగ



మృతి చెందిన తండ్రీ కొడుకులు రామాంజినేయులు, రవి

యల్లనూరు: పుట్లూరు మండలానికి చెందిన తండ్రీ కొడుకును విద్యుత్ తీగ కబళించింది. వేరే ఊరికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తుండగా మార్గమధ్యంలో విద్యుత్‌తీగ తెగిపడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన బయ్యన్న స్వామి పూజారి రామాంజినేయులు(42), కుమారుడు రవి (13) బుధవారం వైఎస్సార్ జిల్లా లింగాల మండలం అంకేవారిపల్లిలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. బంధువులందరితో మాట్లాడి తిరుగు ప్రయాణమయ్యారు. సింహాద్రిపురం మండలం బిదనంచెర్ల నుంచి యల్లనూరు మండలం దంతపల్లి మీదుగా వ్యవసాయ పొలాల రోడ్డులో వెళుతుండగా..మార్గమధ్యంలో విద్యుత్ తీగ తెగి ద్విచక్ర వాహనంపై పడింది. విద్యుత్ షాక్‌కు గురై తండ్రీకొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. సమీపంలోని రైతులు గమనించి విద్యుత్ అధికారులకు తెలియజేశారు. వారు కరెంట్ సరఫరా ఆపేశారు. విషయం తెలుసుకున్న రామాంజినేయులు భార్య భాగ్యలక్ష్మి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. 'చిన్న వయసులోనే నిండు నూరేళ్లు నిండాయా నాయనా.. పొద్దున్నే లేవగానే స్కూల్‌కు వెళ్లి ఉంటే ప్రమాదం తప్పేది కదరా' అంటూ కుమారుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు. కాగా.. రామాంజినేయులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాదంలో మృతిచెందిన ఒక్కగానొక్క కుమారుడు రవి మడుగుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తండ్రీ కొడుకు మృతితో మడుగుపల్లి శోకసంద్రమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీరాంప్రసాద్, ఏఎస్ఐ సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ డీఈ రాజశేఖర్, ఏఈ పద్మనాభరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొత్త లైన్ ఏర్పాటు చేశామని, ఈ లైన్ తెగి పడిందని విద్యుత్ సిబ్బంది చెప్పారు.

ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు వీడాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న 'ఆపస్' రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

అనంతపురం ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం, మరింత ఒత్తిడికి గురిచేసే విధానాలను ఇప్పటికైనా మానుకోవాలని కూటమి సర్కార్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆపస్ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ... ఇప్పటికే రకరకాల యాప్‌లు, ఎఫ్ఎల్ఎన్ మరియు లీడర్‌షిప్ ట్రైనింగ్‌లు, అపార్ నంబర్ జనరేషన్ తదితర బోధనేతర పనులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. 117 జీఓతో ఉపాధ్యాయులపై విపరీతమైన పనిభారం ఉందన్నారు. దీనికి అదనంగా సాయంత్రం 5 గంటల వరకు బడి వేళలు పొడిగించడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉన్న బడివేళలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. అదే సమయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలన్నారు. అప్పటిదాకా మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి మాట్లాడుతూ... 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీఓ 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన అధ్యాపకుడు డాక్టర్ రంగనాథంను సన్మానించారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారుడు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, నాయకులు హర్షవర్ధన్, పీఎస్‌వీ నాయుడు, గోపీచంద్, భాస్కరయ్య, రమేష్ వెంకటేష్ పాల్గొన్నారు.

తెలుగుదేశం నేత బరితెగింపు



మహిళలపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నేత

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు బరితెగించారు. ప్రభుత్వ భూములే కాకుండా సామాన్యులు కష్టపడి కొనుకున్న స్థలాలను సైతం ఆక్రమించుకోవడానికి పన్నాగం పన్నారు. బుధవారం రుద్రంపేటలో ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఏళ్ల నాటి క్రితం కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు హిందూపురం మాజీ కార్పొరేటర్ చక్రపాణినాయుడు తమపై దౌర్జన్యం చేస్తున్నారని బి.యాలేరు గ్రామానికి చెందిన మనేరు ఈశ్వరయ్య కుటుంబసభ్యులు బుధవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ... కక్కలపల్లి సర్వే నంబర్ 133-1, 134లో 4 సెంట్ల స్థలాన్ని 1991లో కొనుగోలు చేసి తమ తల్లి మనేరు నరసమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి, చుట్టూ ఫెన్సింగ్ వేయించామన్నారు. ఆ స్థలాన్ని తాము ఎవరికీ విక్రయించలేదన్నారు. ఆ స్థలానికి చక్రపాణినాయుడుకు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆక్రమించుకునేందుకు తమపై దౌర్జన్యానికి తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాన్ని ఆక్రమించుకుంటే దిక్కేవరు వస్తారని, తనకు పరిటాల శ్రీరామ్, బాలకృష్ణ బంధువులవుతారంటూ స్థలం చుట్టూ నాటిన బండలను జేసీబీతో పగులకొట్టించారని వాపోయారు. ఆ సమయంలో అడ్డుకోబోయిన మహిళలపై తన అనుచరులతో కలసి దురుసుగా ప్రవర్తించారన్నారు. పోలీసు అధికారులు స్పందించి టీడీపీ నాయకుల అరాచకాల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించండి

తాతల కాలం నుంచి సాగులో ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు టీడీపీ నాయకులు కక్షకట్టి తమపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలంటూ గార్లదిన్నె మండలం అంకంపేట గ్రామ రైతు గోపాలరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంకంపేటలోని సర్వే నంబర్ 3-3లో తనకు 1.09 ఎకరాల భూమి ఉందన్నారు. నలభై ఏళ్లుగా తమ పూర్వీకుల నుంచి తాము సాగులో ఉన్నామన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు తమ పేరుపైనే ఉన్నా... కొన్ని నెలలుగా ఆ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

జనవరి 3 నుంచి ఎస్ఎస్‌బీఎన్ 80వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సాయిబాబా జాతీయ పాఠశాల, కళాశాలల 80వ వార్షికోత్సవాన్ని 2025, జనవరి 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేలా ఏర్పాట్లకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బుధవారం ఆ కళాశాలలో సమావేశమై చర్చించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్ బాబు మాట్లాడుతూ 1945లో సత్యసాయిబాబా జాతీయ ఉన్నత పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. కాలక్రమేణ జూనియర్ కళాశాలగా, డిగ్రీ, పీజీ కళాశాలగా వృద్ధి చెందడం సంతోషదాయకమన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న ఎంతోమంది కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలుగా స్థిరపడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పూర్వ విద్యార్థులతో పాటు పూర్వ ఆచార్యులతో కలసి 80 వసంతోత్సవాల పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 3న పాఠశాల వేడుకలు, 4న జూనియర్ కళాశాల వేడుకలు, 5న డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఉంటాయన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న ప్రతి విద్యార్థీ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శి సుంకు వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు శివచంద్ర, అన్నపూర్ణ, కోశాధికారి చంద్రశేఖర్ గుప్త పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



జయుడు (ఫైల్)

గుంతకల్లు రూరల్: దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం మొలకలపెంట గ్రామ మాజీ సర్పంచ్ మొలగవెల్లి రంగమ్మ కుమారుడు జయుడు (42) అదే గ్రామానికి చెందిన వివాహిత వరలక్ష్మితో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. పలుమార్లు ఆమె వద్దని వారించినా జయుడు వినకుండా ఇబ్బంది పెడుతూ వచ్చాడు. దీంతో జయుడి బారి నుంచి తప్పించుకునేందుకు కొంత కాలం ఇతర ప్రాంతాల్లో తల దాచుకున్న వరలక్ష్మి.. కొంత కాలం క్రితం గుంతకల్లుకు మకాం మార్చింది. ఈ విషయం తెలుసుకున్న జయుడు ఈ నెల 8న రాత్రి గుంతకల్లులోని వరలక్ష్మి ఇంటికి చేరుకుని ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. విషయాన్ని వెంటనే వరలక్ష్మి తన కుమారుడు ఉదయ్‌కి ఫోన్ చేసి తెలపడంతో తన స్నేహితుడు చందును తీసుకుని ఇంటికి ఉదయ్ చేరుకున్నాడు. ఆ సమయంలో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగిన జయుడిని వరలక్ష్మి, ఉదయ్, చందు కొట్టి, అనంతరం మొలకలపెంట గ్రామ శివారులో పడేసి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో స్పృహలోకి వచ్చిన జయుడు తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి పోయారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు, అక్కడి నుంచి తిరిగి కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం కర్నూలు ఆస్పత్రిలో ఆయన మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయికి 10 నెలల జైలు

అనంతపురం: నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న చోరీ ఘటనలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 10 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ ఏడాది మే 18న తన ఇంటికి చాకలి నారాయణ తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి పొరుగు ఇంట్లో నిద్రపోయాడు. విషయాన్ని గుర్తించిన గుంతకల్లుకు చెందిన నల్లబోతుల వాసు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి ఒక జత బంగారు కమ్మలు, మూడు జతల వెండి కాళ్ల పట్టీలు, ఒక శ్యామ్‌సంగ్ టీవీ, చిన్న పిల్లల దుస్తులు, రూ.68 వేలు విలువ చేసే పరికరాలు చోరీ చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు వాదనలు పూర్తయి తుది తీర్పు బుధవారం వెలువడింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి నల్లబోతుల వాసుకు పది నెలల జైలు శిక్ష విధిస్తూ మొబైల్ కోర్టు న్యాయమూర్తి జె.సుజిన్ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ వి.శ్రీనివాసులు వినిపించారు.

మహిళను బెదిరించిన కేసులో ఏడాది జైలు

అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ మహిళను, ఆమె నాన్నను దుర్భాషలాడిన ఘటనలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఒకటో స్పెషల్ కోర్టు జడ్జి కె.శివశంకర్ బుధవారం తీర్పు వెలువరించారు. నగరంలోని రంగస్వామి నగర్‌లో నివాసముంటున్న రమేష్ అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళపై అనుచితంగా ప్రవర్తించినట్లుగా నేరం రుజువైంది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎలమాసు భాను వాదనలు వినిపించారు.

ఆర్‌ఆర్‌బీ పరీక్షార్థుల కోసం ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ఈ నెల 23, 24వ తేదీల్లో ఆర్‌ఆర్‌బీ పరీక్షలు రాసే అభ్యర్థుల రాకపోకలకు అనుకూలంగా అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు బుధవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించాయి. 23న నాంథేడ్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు(07105) మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుతుంది. తిరిగి ఈ రైలు తిరుపతి జంక్షన్ నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు నాంథేడ్ జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైళ్లు ముద్కెడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

● గురి కుదిరింది...

ఏకే 47తో ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్



అనంతపురం నగర శివారులోని ఇటుకలపల్లి సమీపంలో ఉన్న మన్నీల ఫైరింగ్ రేంజ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం వార్షిక ఫైరింగ్ సాధన చేశారు. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా పాల్గొని వివిధ రకాల ఆయుధాలను ఉపయోగించి ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఇందులో ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఎల్ఎంజీ, ఇన్సాస్, పిస్టల్ ఉన్నాయి. - అనంతపురం

సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ

- పంచలోహ విగ్రహం, వెండి సామగ్రి అపహరణ



ఆలయంలో చోరీకి పాల్పడుతున్న దృశ్యం (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: స్థానిక శిరిడి సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 19న మాలాధారణ భక్తుడిగా ఆలయానికి వెళ్లిన ఓ దుండగుడు సాయిబాబా పంచలోహ విగ్రహంతో పాటు పెద్ద ఎత్తున వెండి సామగ్రి అపహరించుకెళ్లాడు. ఆ సమయంలో ఆలయంలో ఎవరూ లేకపోవడం గమనార్హం. మూలవిరాట్ వద్ద ఉంచిన బాబా పంచలోహ విగ్రహం, వెండి సామగ్రి, గంటను ఒక బ్యాగ్‌లో పెట్టుకోని తీసుకెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. బుధవారం దుయం ఆలయంలో విలువైన వెండి సామగ్రితో పాటు స్వామి పంచలోహ విగ్రహం లేకపోవడంతో సీసీ కెమెరా ఫుటేజీలను ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. దీంతో చోరీ విషయం వెలుగు చూసింది. ఘటనపై పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఆసియా దేశాల సదస్సుకు అనంత మేయర్



ఇరాన్ దేశ రాజధాని తెహరాన్‌లో మేయర్ వసీం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇరాన్‌లో గురు, శుక్ర వారాల్లో జరగనున్న ఆసియా దేశాల మేయర్ల సదస్సులో పాల్గొనేందుకు అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం వెళ్లారు. బుధవారం ఇరాన్ దేశం రాజధాని తెహరాన్‌కు చేరుకున్న ఆయనకు అక్కడి మునిసిపల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. గురు, శుక్రవారం రెండురోజుల పాటు ఆసియన్ మేయర్స్ ఫోరం (ఏఎంఎఫ్) ఆధ్వర్యంలో ఖోర్రామాబాద్‌లో జరిగే సదస్సులో ఆయన పాల్గొననున్నారు. నగరాల్లో పౌరుల మధ్య మంచి సంబంధాలు పెంచడం, మెరుగైన జీవనం కల్పించడం, ఆయా దేశాల మధ్య దౌత్యం, పరస్పర విజ్ఞాన మార్పిడి, సాంకేతిక పరిజ్ఞానంతో ఆయా నగరాల్లో చేపట్టిన వివిధ కార్యక్రమాలపై మేయర్లు తమ అనుభవాలను వివరించనున్నారు. ప్రధానంగా పర్యావరణం, పట్టణ ఆరోగ్యంపై చర్చించనున్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ...ఇతర దేశాలు మన నగరాన్ని గుర్తించడం గర్వకారణం అన్నారు. ఇది అనంతపురం నగర ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతి లెటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 26వ తేదీ వరకూ గడువు పొడిగించారు. ఈ మేరకు లేపాక్షిలోని విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉచిత ప్రవేశ పరీక్ష 2025, ఫిబ్రవరి 8న ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్హులైన ఉమ్మడి జిల్లా విద్యార్థులకు నాగరాజు పిలుపునిచ్చారు.

ఇంటి పన్ను వివరాలు వారం లోపు అప్‌లోడ్ చేయాలి

అనంతపురం రూరల్: ఇంటి పన్ను వివరాలను వారం లోపు అప్‌లోడ్ చేయాలని పంచాయతీ అధికారులను డీపీఓ నాగరాజునాయుడు ఆదేశించారు. ఇంటి పన్ను అంశంపై బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌డీఓలు, ఈఓఆర్డీలతో ఆయన సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకుని ఇంటి పన్ను వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించాలని రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. బీకేఎస్‌లోని గాంధీనగర్ రైతు సేవాకేంద్రంలో బుధవారం నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకూ బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు చేస్తామన్నారు. తీసుకున్న రుణాన్ని పంట కాలం అయిన తర్వాత బ్యాంకులకు చెల్లించాలన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన పంటలకు మాత్రమే నష్టపరిహారం, బీమా తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఎల్‌డీఎం నరసింహారావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పథకం లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, రెడ్డిపల్లి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, ఎస్‌బీఐ మేనేజర్ శరత్, మండల ఏఓ శ్యామసుందరరెడ్డి, ఏఈఓ జ్ఞానజ్యోతి, నగేష్, వీఏఓలు, వీహెచ్‌ఓలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

ఆత్మకూరు: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహహింస, సమన్యాయం, సమాన అవకాశాలు, సమాన వేతనం, మొదలగు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ న్యాయవాదులు పద్మజ, హరికృష్ణ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీపీ హేమలత, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఏపీఓ సుజాత, ఎంఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళిత, గిరిజనులపై రోజురోజుకు దాడులు జరుగుతున్నాయి. హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్సీ, ఎస్టీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు నెరమెట్ల ఎల్లన్న అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎస్సీ, ఎస్టీ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళిత, గిరిజనులకు న్యాయం జరగలేదని తెలిపారు. హక్కుల కోసం ఫోరంను బలోపేతం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నూతన కమిటీని నియమించినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా హనుమన్న, అధికార ప్రతినిధిగా భీమలింగ, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, గౌరవ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వన్నూరు స్వామి, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రిస్వామి, సలహాదారులుగా కాశీ సుబ్బరాయుడు, ట్రెజరర్‌గా ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అశ్వర్థ నారాయణ, గోవిందు, కిరణ్, డేవిడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, చిరంజీవి, పోలా వీరాంజనేయులు, రవిరాజు, ముసలన్న, ఓబులేసు, శివ తదితరులు పాల్గొన్నారు.


సేవాభావం అలవర్చుకోవాలి



ఆశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో నైతిక విలువలను నిర్మాణం చేయడమే లక్ష్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని స్వామి శ్రీసత్యాత్మానంద అన్నారు. బుధవారం నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని కోవూరు నగర్‌లోని ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఛాత్రాలయానికి 17 రకాల వస్తువులు, బియ్యం ప్యాకెట్లను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మలా మురళీ అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. చిన్నారులకు అవసరమైన వస్తువులను దాతలు సమకూరుస్తుండటం ఆనందంగా ఉందన్నారు. అందరూ సేవాభావం అలవరచుకుంటే సమాజం ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చక్రపాణి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: అన్నదాత సుఖీభవ పథకం అమలుతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు తక్షణమే అందించాలని కూటమి సర్కార్‌ను ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి బడ్జెట్ రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. అనంతరం డిమాండ్ల పత్రాన్ని డీఆర్ఓ ఎ.మలోలకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లలితమ్మ, నాయకులు మధుయాదవ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రాప్తాడు: మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ విజయకుమారి హెచ్చరించారు. బుధవారం రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ప్రతి ఒక్కరూ త్వరగా అపార్ కార్డును చేపించుకోవాలన్నారు. అపార్ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. హెచ్ఎం సాంబశివ, నరసింహులు పాల్గొన్నారు.

కంపలు తొలగించి.. చెత్త వదిలేసి



చెత్త, చెదారంతో నిండిపోయిన ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్

- నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్
- పట్టించుకోని అధికారులు
- బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలంటున్న ప్రయాణికులు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఆత్మకూరు: రూ.లక్షలు ఖర్చు చేసిన ఆర్టీసీ బస్టాండ్ ఉపయోగానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన కొన్నేళ్ల క్రితం బస్టాండును నిర్మించారు. అయితే బస్టాండును వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. దీనిపై ఇటీవల సాక్షిలో బస్టాండ్‌లో ముళ్లకంపలు, చెత్తాచెదారంతో నిండిన వైనంపై కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ అధికారులు వచ్చి బస్టాండ్‌లో ఉన్న ముళ్లచెట్లను తొలగించి చేతులు దులుపుకున్నారు. దీంతో బస్టాండ్‌లో ఉన్న చెత్తాచెదారం అలాగే ఉంది.

బస్టాండ్‌లోపలికి రాని బస్సులు

బస్టాండ్ ఆవరణం చెత్తాచెదారంతో నిండిపోవడంతో కనీసం కూర్చోడానికి కూడా వీలు లేని పరిస్థితి. బస్టాండ్ రోడ్డు పక్కనే ఉన్న బస్సులు మాత్రం బస్టాండ్ లోపలికి రాకుండా వెళ్తున్నాయి. అంతేకాకుండా బస్టాండ్ వెనుక భాగాన ఉన్న మరుగుదొడ్లుకు నీటి సదుపాయం లేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు బస్టాండ్ ఆవరణలో స్థానికులు పలు దుకాణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణానికి రూ.800 నుంచి వెయ్యి చొప్పున నెలకు అద్దె వసూలు చేస్తుంటారు. ప్రతినెలా 10వ తేదీ లోపు అద్దె ఇవ్వకుంటే రూ.వంద ఫైన్ కూడా వసూలు చేస్తుంటారు. అద్దెలు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ బస్టాండ్‌ను శుభ్రపరిచి ఉపయోగంలోకి తీసుకువచ్చే దానిపై లేదంటూ సంబంధిత అధికారులపై ప్రయాణికులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ఆత్మకూరు నుంచి రోజూ వందల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఆత్మకూరు నుంచి అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బెళుగుప్ప, మడకశిర, చిత్రదుర్గం, శెట్టూరు తదితర ప్రాంతాలకు ఆత్మకూరు మీదుగా బస్సులు వెళ్తుంటాయి. బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో బస్సులు బస్టాండ్‌లోపలికి రాకుండా వెళ్తున్నాయి. దీంతో వర్షం వచ్చినా, ఎండలు ఉన్నా ప్రయాణికులు చెట్ల కిందనే బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది.

బస్టాండ్ శుభ్రంగా లేదు



ఆత్మకూరు బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లడమే మానేశారు. బస్టాండ్ శుభ్రంగా లేకపోవడంతో చెట్ల కింద సేద తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాండులో సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– రామునాయక్, గొరిదిండ్ల తండా


సౌకర్యాలు కల్పించాలి



బస్టాండులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రధానంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలి. లైట్లు, ఫ్యాన్ లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. బస్టాండు ప్రాంగణమంతా చెత్తాచెదారంతో నిండి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి. రాత్రి పూట ఆర్టీసీ బస్సులను మండల కేంద్రంలోకి వచ్చి పోయేలా చూడాలి.

– ఫణిరెడ్డి, పి.యాలేరు

బాధ్యతలు తీసుకున్న 'గంధం'



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శిగా నియామకైన కళ్యాణదుర్గం కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం గంధం శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జాయినింగ్ రిపోర్ట్‌ను డీఈఓ ప్రసాద్‌బాబుకు అందజేశారు. ఇదిలా ఉండగా డీసీఈబీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఏపీటీఎఫ్ (1938) సీనియర్ నాయకుడు గంధం శ్రీనివాసులును ఆ సంఘం నాయకులు స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు వెంకటరెడ్డి, రవీంద్ర, సత్యప్రసాద్, అశోక్ నాయక్, ఫక్రుద్దీన్, నారాయణ నాయక్, కృష్ణారెడ్డి, షమీవుల్లా, మల్లి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సత్కారం

అనంతపురం: ప్రజల మాన, ధన, ప్రాణాలను రక్షించడంలో గత నెల ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ పి.జగదీష్ బుధవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్, గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేశ్ నాయక్, జిల్లా పోలీసు కార్యాలయం లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లోకనాథ చౌదరి, అనంతపురం రూరల్ ఎస్ఐ రాంబాబు, 9 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడల్లో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: సాంఘిక సంక్షేమ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్) గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 14, 15 తేదీల్లో పులివెందుల గురుకుల పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీల్లో విద్యార్థిని చిద్విలక్ష్మి గోల్డ్‌మెడల్, 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బ్రాంజ్ మెడల్, షాట్‌పుట్ పోటీల్లో స్పందన గోల్డ్‌మెడల్ సాధించింది. అలాగే త్రోబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ సాయిలీల, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర తదితరులు విద్యార్థినులను అభినందించారు.

తుపాకీ కంటే గొప్ప ఆయుధం పుస్తకం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, గ్రంథాలయ ఉద్యోగులు



రాప్తాడు: బహుమతులు పంపిణీ చేస్తున్న ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్

అనంతపురం సిటీ/రాప్తాడు/ఆత్మకూరు: తుపాకీ కంటే గొప్ప ఆయుధం పుస్తకం. పుస్తక పఠనంతోనే సంపూర్ణ వికాసం సాధ్యమని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. బుధవారం అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ ఆవరణలో ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రమాదేవి అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే పిల్లలను పుస్తక పఠనం వైపు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. వ్యక్తిని పరిపూర్ణమైన మనిషిగా మార్చే మహత్తర శక్తి పుస్తకానికి మాత్రమే ఉందని గుర్తు చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పాఠకులకు డిజిటల్ లైబ్రరీలను కూడా అందుబాటులోకి తీసుకురావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన 54 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారి ఇంతియాజ్, కవి, సోషల్ వర్కర్ షేక్ నబీరసూల్, రిటైర్డ్ టీచర్లు శ్రీరాములు, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వీరనారాయణ రెడ్డి, హెచ్ఎం సాంబశివా, పాఠకులు బుల్లే నాగన్న, రామాంజనేయులు, శ్రీహరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు కస్తూర్బా పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మండల గ్రంథాలయ అధికారి నల్లమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ బహుమతులు అందజేశారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి



పీఎఫ్ విభాగంలో తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్‌లో ఉద్యోగం చేసే అవకాశం వచ్చిందంటే ఆషామాషీ కాదు. అటువంటి అరుదైన అవకాశం మీకొచ్చిందంటే ఇక్కడ ఎంతో బాధ్యతగా పని చేయాల్సి ఉంటుంది. ఏ రోజు చేయాల్సిన పనులు ఆ రోజే పూర్తి చేయాలి. పెండింగ్‌లో పెట్టడానికి వీల్లేదంటూ ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. బుధవారం ఆమె జెడ్పీలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 80 శాతం ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి జెడ్పీకి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె తొలిసారి సెక్షన్లకు వెళ్లారు. జెడ్పీలోని పై అంతస్తులో గల అన్ని సెక్షన్లను పరిశీలించారు. పీఎఫ్ సెక్షన్‌లో ఫైళ్లు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సెక్షన్‌లో తమ వద్ద ఎటువంటి ఫైళ్లు పెండింగ్‌లో లేవని.. గతంలో పని చేసిన అధికారులు సకాలంలో సంతకాలు చేయకపోవడంతోనే పెండింగ్‌లో ఉన్నాయని సిబ్బంది కొందరు తెలిపారు. నాలుగైదు రోజుల్లో సీఈఓ వస్తారని.. ఆయన రాగానే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఏఓలను ఆదేశించారు. కొందరు ఏఓల పని తీరుపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అటువంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగిలిన సెక్షన్లలోనూ పర్యటించి, అక్కడి సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఎవరెవరు ఏయే సెక్షన్లు చూస్తారంటూ అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలకంటే జెడ్పీ కీలకమైనదని.. ఇక్కడ ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. సమష్టిగా పని చేసి జెడ్పీ ప్రతిష్టను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

సంక్రాంతి సెలవుల తర్వాతే 'అనంత సంకల్పం'



ఏడీ కృష్ణయ్యకు వినతపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులకు 'అనంత సంకల్పం' కార్యాచరణ ప్రణాళికను సంక్రాంతి సెలవుల తర్వాత నుంచి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో సిలబస్ పూర్తి కావాల్సి ఉందన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత, రెండో శనివారాలు, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాలను మినహాయించి కార్యాచరణను అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఏడీని కలిసిన వారిలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, కో చైర్మన్ పురుషోత్తం, సెక్రటరీ జనరల్ జి.లింగమూర్తి, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎన్.రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు లింగమయ్య, శివశంకర్, ఎస్.రామాంజనేయులు, రామకృష్ణ, శ్రీనివాసులు, గంగాధర్ సుహైల్, మన్సూర్ ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్

రాప్తాడు: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత. అనంతపురాన్ని బాలల స్నేహ జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పంగల్ రోడ్డు సమీపంలోని సమ్మిళిత ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. బాలలు మన జాతీయ సంపద.. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. బాలలు కూడా తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు అబ్బాయిలను ఒక విధంగా అమ్మాయిలను మరోక విధంగా చూడాకుండా ఇద్దరినీ సమానంగా చూడాలన్నారు. ఆర్డీటీ సంస్థ బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఐడీ డైరెక్టర్ రఫిక్, పెనుగొండ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, మేనేజర్ హనుమంతు, పాఠశాల ఇన్‌చార్జ్ విశ్వనాథ్, పాల్గొన్నారు.

శకుంతలమ్మ మృతి తీరని లోటు



శకుంతలమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: శకుంతలమ్మ మృతి మహిళ సమాఖ్య కార్మిక ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. బుధవారం స్థానిక సంగమేష్ నగర్‌లోని శకుంతలమ్మ స్వగృహం వద్ద ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. వైద్య కళాశాల వరకు నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. శకుంతలమ్మ భర్త రుషేంద్రబాబు, కుమారుడు రాజేష్, కుమార్తె హిమబిందు, నాయకులు శంకుతలమ్మ పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. సీపీఐలో శకుంతలమ్మ పలు బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. అలాంటి నాయకురాలిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవులు, సీనియర్ నాయకులు అమీనమ్మ, నాయకులు లింగమయ్య, శ్రీరాములు, రమణ, బద్రిస్వామి, కేశవరెడ్డి, రాజేష్ సంతోష్ కుమార్, అల్లీపీరా, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స



బేబీని ఐసీయూలో ఉంచిన దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక మెడిక్యూర్ హాస్పిటల్‌లో బుధవారం ఓ గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాలు.. ఓ మహిళ గర్భం దాల్చడంతో పాటు ఫైబ్రాయిడ్‌తో బాధపడుతుండేది. ఫైబ్రాయిడ్ తీయించుకుంటే పిల్లలు కారు అని వివిధ ఆస్పత్రుల వైద్యులు చెప్పారు. ఈ కేసు మెడిక్యూర్ ఆస్పత్రికి వచ్చింది. పరిశీలించిన డాక్టర్ నిస్సీవినూత్న రిస్క్ కేసుగా పరిగణించారు. ఒక వేళ కాన్పు అయినా అబార్షన్ అయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. బేబీ గ్రోత్‌తో పాటు ఫైబ్రాయిడ్ గ్రోత్ కూడా పెరుగుతూ వచ్చింది. ఈ మహిళ క్రమం తప్పకుండా చెకప్‌కు వచ్చేవారు. 26 వారాల నుంచి సదరు గర్భిణికి ఉమునీరు పోతూ వచ్చింది. ఎప్పటికప్పుడు వైద్యం చేస్తూ డెలివరీని పొడిగించారు. 29 వారాలకు అడ్మిట్ అయింది. అప్పటికీ ఉమునీరు పోతూనే ఉంది. 30 వారాలు పూర్తయిన తర్వాత బుధవారం డాక్టర్ నిస్సీవినూత్న సిజేరియన్ చేశారు. మూడు కిలోల బరువు కల్గిన ఫైబ్రాయిడ్‌ను కూడా తొలిగించారు. బేబీ బరువు 1.3 కిలోలు ఉండగా.. ఐసీయూలో ఉంచారు. ప్రస్తుతం తల్లీ కూడా ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యురాలు వెల్లడించారు.

భాషా సౌందర్యానికి పద్యమే మూలం



మాట్లాడుతున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి జయకుమార్ బాబు

అనంతపురం కల్చరల్: భాషా సౌందర్యానికి పద్యమే మూలమని పలువురు వక్తలు అన్నారు. జిల్లా మ్యూజియం, పర్యాటక శాఖ, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాల ప్రాంగణంలో పద్య పఠన పోటీలు జరిగాయి. పురాణేతిహాసాలు, శతక పద్యాల్లోని పద్యాలను విద్యార్థులు రాగయుక్తంగా ఆలపించి ఆకట్టుకున్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు, ఇంటాక్ పూర్వపు కన్వీనర్ ఏజీ వేణుగోపాల రెడ్డి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఒంటెద్దు రామలింగారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ప్రజాగాయకుడు రామాంజనేయులు, నబీరసూల్ తదితరులు మాట్లాడారు. తెలుగు భాషలోని మాధుర్యమంతా పద్యంలోనే ఉందన్నారు. పద్యాలను మరచిపోకుండా కంఠస్థం చేయించాలని సూచించారు. విద్యార్థులకు సుభాషిత సుమసౌరభాలు పుస్తకాలనందించారు. అలాగే సెలబ్రేటింగ్ ఇండియా పోస్టర్ మేకింగ్ అండ్ రైట్అప్ కాంపిటీషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థులకు ఈనెల 24న బహుమతులు అందజేస్తామని ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పద్యకవి రియాజుద్దీన్, సీనియర్ రచయిత పతికి రమేష్ నారాయణ, రైతు సంఘం కసిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నాగభూషణం, శ్వేతవాహన, సాధుశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన సహకార వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారం ముగిశాయి. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఇ.అరుణకుమారి, టౌన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ.. సహకార వ్యవస్థ బలోపేతం ద్వారా రైతులు, అన్ని వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. డీఎల్‌సీఓ ఎం.ప్రభాకరరెడ్డి, శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, డీసీసీబీ మాజీ సీఈఓ వేములేటి నరసింహారెడ్డి, అధ్యాపకులు కె.నాగవీణ, జే.మేథిని, సహకార విద్యాధికారి బి.మురళీ మోహన్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 28 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఎండీ షరీఫ్

అనంతపురం ఎడ్యుకేషన్: అధునాతన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ దూసుకెళ్లాలని ఫార్చ్యూన్ కనెక్ట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షరీఫ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కేవలం సర్టిఫికెట్ ఉంటే సరిపోదన్నారు. పని చేస్తున్న రంగానికి పూర్తి నైపుణ్యాలు ఉండాలన్నారు. నైపుణ్యాలు నేర్చుకోవడానికి కూడా చాలా మార్గాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ కంపెనీల సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం 28 మంది విద్యార్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి

ఆత్మకూరు/అనంతపురం అర్బన్: రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు, అనంతపురంలో జీపుజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. గత పది సంవత్సరాల్లో నరేంద్రమోదీ కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచి, రూ.600 కూలి అందజేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లన్న, సీఐటీయూ నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, శీన, అవాజ్, వలి, జయమ్మ, ఎర్రిస్వామి, తిరుమలేసు, తదితరులు పాల్గొన్నారు.